క్లుప్తంగా

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలి



లక్ష్మీపురం: నగరంలోని పేద ప్రజలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాన్ని కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శారదాకాలనీ మామిళ్లపల్లి మాలకొండయ్య స్థూపం వద్ద సోమవారం ఇల్లు లేని నిరుపేద పేదల నుంచి ఇళ్ల స్థలాలకు దరఖాస్తులను సోమవారం తీసుకున్నారు. మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలని లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. సీపీఐ పిలుపులో భాగంగా నగరంలోని 22, 57, 18 డివిజన్‌లలో పార్టీ శాఖ కార్యదర్శి జగన్నాథం, మరియదాసు, నూతలపాటి చిన్న ఆధ్వర్యంలో సచివాలయాల్లో వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, విరిగినేని వెంకటేశ్వరరావు, దండు రవి ,రాగం నాగరాజు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు లలిత కళలు దోహదం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో సోమవారం 27వ లలిత కళా ఉత్సవ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థులకు కవిత, కథా, లేఖారచనతో పాటు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి మాట్లాడుతూ విద్య అంటే పుస్తక పరిజ్ఞానం ఒక్కటే కాదని, కళలు అందులో ఒక భాగమని అన్నారు. బాలల్లోని సృజనాత్మకతను వ్యక్తీకరించేందుకు, మానసికోల్లాసానికి లలిత కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. బాల్యదశ నుంచే కళలపై ఆసక్తి కలిగించినట్లుయితే బాలలు సున్నిత భావాలతో ఎదిగి, విలువలను అలవర్చుని మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. మానసిక వికాసం ప్రగతికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిసెంబర్ 10న నిర్వహించనున్న బాలల లలిత కళా ఉత్సవంలో సర్వోత్తమ, విశిష్టోత్తమ, ఉత్తమ బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

విశేష అలంకారంలో మల్లికార్జునస్వామి



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా స్వామివారు విశేష అలంకారంతో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖర శర్మ స్వామికి విశేష అలంకారంతో పాటు ప్రత్యేక హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం




నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం శ్రీమద్భగవద్గీత ఏకాదశ అధ్యాయంలోని విశ్వరూప సందర్శన యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు మొదలయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కాకరపర్తి వెంకటనారాయణరావు ధర్మపత్ని ప్రమీలాదేవి సహకారం అందించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు: 11కేవీ లైన్ మెయింటెనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరా మంగళవారం నిలిపివేయనున్నట్లు గుంటూరు -2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. సాయిబాబా నగర్, కృష్ణబాబు నగర్, పలకలూరు రోడ్డు విజ్ఞాన్ కళాశాల ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఊపిరి కష్టమవుతోంది..

- వ్యాధి బారిన పడుతున్న యువత
- రేపు వరల్డ్ సీఓపీడీ డే



గుంటూరు మెడికల్: గుంటూరు వసంతరాయపురంకు చెందిన సుబ్బారావు ప్రతిరోజూ సిగరెట్లు కాలుస్తాడు. మూడు నెలలుగా దగ్గు వస్తున్నా పట్టించుకోలేదు. స్మోకింగ్ మానివేయాలని వైద్యులు ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోలేదు. చలికాలం ప్రారంభం అవ్వటంతో ఓ రోజు రాత్రి శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉండి నిద్రకూడా పట్టక పోవటంతో అర్ధరాత్రి ఆస్పత్రికి పరుగులు తీశాడు. వైద్యులు శ్వాసకోసనాళాలకు సోకే సీఓపీడీ వ్యాధి సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇలా ఎందరో వ్యాధి సోకినా తెలియక ప్రాణాపాయ స్థితి వరకు ఇళ్ల వద్ద ఉంటూ చివరి సమయంలో పరుగులు తీస్తున్నారు. సీఓపీడీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది నవంబర్ మూడో బుధవారం ప్రపంచ సీఓపీడీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

సీఓపీడీ అంటే...

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్(సీఓపీడీడి) ఊపిరితిత్తులకు వచ్చే ఒకర కమైన వ్యాధి ఇది. వ్యాధి సోకిన వారికి గాలి గొట్టాలు ఇన్‌ఫెక్షన్‌కు గురై కొన్నిసార్లు మూసుకుపోయి ఊపిరి తీసుకోవటం కష్టంగా ఉంటుంది. ఆయాసం, దగ్గు, కళ్లెపడటం, ఛాతిలో బరువుగా ఉండటం, ఛాతి పట్టేసినట్లుగా ఉండటం, గుండెదడ, కాళ్లు వాయటం, పిల్లికూతలు, బరువు తగ్గటం, కొద్దిగా జలుబు చేయగానే ఊపిరి తీసుకోవటం కష్టంగా ఉండటం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఛాతి ఎక్సరే, స్పైరో మెట్రో లేదా పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ ద్వారా వ్యాధిని నిర్ధారణ చేస్తారు.

ఈ వ్యాధి ఎవరికి వస్తుంది...

ఈ వ్యాధి సాధారణంగా 30 ఏళ్లు పైబడిన వారికి ఎక్కువ వస్తుంది. పొగతాగే వారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పొగతాగకపోయినా పొగతాగేవారి పక్కన ఉండి పొగ పీల్చటం వలన కూడా వ్యాధి వస్తుంది. గాలి కాలుష్యం, వాతావరణ కాలుష్యం, కట్టెల పొయ్యి, పిడకల పొయ్యి వినియోగించే వారికి, బొగ్గు గనుల్లో, సిమెంట్ ఫ్యాక్టరీల్లో, వస్త్ర పరిశ్రమల్లో పనిచేసేవారికి, దుమ్ము, ధూళితో కూడుకున్న ప్రదేశాల్లో, పరిశ్రమల్లో పనిచేసేవారికి వ్యాధి సోకుతుంది. ఉబ్బసం(ఆస్తమా), అలర్జీ ఉన్నవారు జబ్బు నయం అయ్యేందుకు వైద్యం చేయించుకోకపోతే సీఓపీడీ రావచ్చు. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 38.6 కోట్ల మంది సీఓపీడీ వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధితో 3 కోట్ల మంది చనిపోతున్నారు.

జిల్లాలోవ్యాధి బాధితులు

జిల్లాలో 50 మందికి పైగా ఛెస్ట్ పిజీషియన్లు ఉన్నారు. ప్రతిరోజూ సీఓపీడీ బాధితులు ఒక్కొక్కరి వద్ద ఐదు నుంచి పది మంది వైద్యసేవలను పొందుతున్నారు. గోరంట్లలోని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రిలో ప్రతిరోజూ 20 నుంచి 30 మందికి పైగా బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి...



సీఓపీడీ బాధితులు చలి కాలంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి నుంచి విముక్తి కోసం, వ్యాధి సోకుండా ధూమపానం విడనాడాలి. దుమ్ము, ధూ ళి, పొగ, వాయు కాలుష్యం వెదజల్లే ప్రాంతాల కు దూరంగా ఉండాలి. ఊపిరితిత్తులకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పల్మనాలజీ వైద్యులను సంప్రదించాలి. క్రమం తప్పకుండా మందులు వాడాలి.

–డాక్టర్ బి.దుర్గాప్రసాద్,
పల్మనాలజిస్ట్, గుంటూరు

పుస్తక పఠనంతో విజ్ఞానం

టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ అనితాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినా పుస్తక పఠనం ఎంతో కీలకమని టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల గ్రంథాలయ విభాగ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనితాదేవి మాట్లాడుతూ విద్యాసంస్థలకు గ్రంథాలయాలు హృదయాలు వంటివని, మహనీయుల అమూల్యమైన మాటలు, వారి జీవిత చరిత్రలు పుస్తక రూపంలో గ్రంథాలయాల్లో పొందుపర్చబడి ఉంటాయని అన్నారు. గ్రంథాలయాల్లో విజ్ఞానదాయక పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందని, చదువుల్లో పోటీపడి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈసందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వై.రాణి(ప్రజ్ఞ స్కూల్), సిద్దిక్ సయ్యద్(భాష్యం)కు వరసగా రూ.రెండు వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అదే విధంగా ఎస్.లక్ష్మీప్రియ(బాలకుటీర్), ఎండీ వాసిం అర్షాద్(హిందూ హైస్కూల్), టి.రోహిత్(సెంట్రల్ పబ్లిక్ స్కూల్), కె.అనిల్ (ప్రజ్ఞ స్కూల్), బి.వెంకట అజయ్(భాష్యం)లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీ, డిగ్రీ, పీజీ గ్రంథాలయ శాఖాధిపతులు బి.సాయికళ, కె. పద్మజ, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల విజేతలతో అధ్యాపకులు



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గ్రంథాలయ వారోత్సవాల్లో రంగోలి పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో విద్యార్థినులకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా నగరపాలకసంస్థ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థినులకు పోటీల్లో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.మాల కొండయ్య, సిలికా సొల్యూషన్స్ ఎండీ పుల్లమ్‌రాజు, గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్యశిరీష, సిబ్బంది పి.కోటేశ్వరి, పి.సుధాకర్, ఉపాధ్యాయురాలు పి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఐ-టీడీపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్లు, లీగల్ సెల్ బృందం



పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఐ టీడీపీపై ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లక్ష్మీపురం: తెలుగు దేశం పార్టీకి చెందిన ఐ టీడీపీ సోషల్ వీడియాలో వైఎస్సార్ సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం పార్టీ లీగల్‌సెల్ సభ్యులు మొండితోక శ్రీనివాస్‌తో కలసి కార్పొరేటర్ బూసి రాజలత, కో ఆప్షన్ సభ్యుడు పూనూరు నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ తుమ్మెటి శ్రీను, పార్టీ నాయకులు కొరిటిపాటి ప్రేమ్ కుమార్ ఎస్ఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలో చూస్తుండగా సుజిత్ అనే వ్యక్తి ఐ టీడీపీ సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి పై ఒక ఫొటోను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేశాడు. మార్ఫింగ్ చేసిన ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖంతో సినీ నటుల ఫొటోను మార్ఫింగ్ చేసి కించపరుస్తూ పోస్ట్ చేసినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాలమురళీ, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలతో కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు మెడికల్: భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు హిందూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సౌత్ ఇండియా రీజియన్ భారత్ కో జానో క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో తమిళనాడు జయగోపాల్ గరోడియా విద్యాలయానికి చెందిన విద్యార్థులు అరవిందస్ ఎం.కార్తికేయన్ ప్రథమ బహుమతి గెలుచుకుని వచ్చే ఏడాది జనవరి 19న లక్నోలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కర్ణాటకు చెందిన కిర్లోస్కర్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అరుణాచల్ లాద్వా, పీఎస్ కుషాల్ ద్వితీయ బహుమతి, మచిలీపట్నానికి చెందిన శ్రీబాలాజీ విద్యాలయం విద్యార్థులు రాగసృజన, హర్షవర్ధిని తృతీయ బహుమతి గెలుచుకున్నారు. సీనియర్ విభాగంలో విశాఖపట్నంకు చెందిన ప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు విశాంత్ కార్తికేయ శ్రావణ్‌కుమార్ ప్రథమ బహుమతి గెలుచుకుని జాతీయ పోటీలకు అర్హత సాధించారు. రెండో బహుమతిని తమిళనాడుకు చెందిన ఆర్.అభినందన్, భరత్‌బాలాజీలు గెలుచుకున్నారు. మూడో బహుమతిని విజయవాడ ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సాయిసమ్రాన్, జితేష్‌లు సాధించారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో భారత్ వికాస్ పరిషత్ కార్యక్రమాలకు తనవంతు సహాయం చేస్తానని ప్రకటించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచం మన సంస్కృతిని గుర్తించి అనుసరిస్తుంటే, మన యువత అవి తెలియని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత భారత్ వికాస్ పరిషత్ తీసుకుందన్నారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ భారత్ కో జానో కార్యక్రమం ఉత్తరప్రదేశ్‌లో 2000లో ప్రారంభమైందని, నేడు దేశ వ్యాప్తంగా 80 ప్రాంతాల్లో జరుగుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రూప్‌చంద్ జైన్, కమల్ నయన్, ఎం.వి.ఎస్.రామచంద్రరావు, రాజన్‌వలియాతన్, పురుషోత్తమ శాస్త్రి, రాజ్‌గోపాల్ పాయ్, మురళీధర్, బైరిశెట్టి మల్లికార్జునరావు, టి.ఎస్.రాజశేఖర్, కాళంగి శ్రీనివాసరావు, కె.వి.ఎస్.రఘువీర్, కాశిప్రసాద్, ఎం.వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

గుంటూరు మెడికల్: సత్తెనపల్లి హాస్టల్ విద్యార్థినులు ఆత్మహత్యాయత్నానికి కారణమైన వార్డెన్ రాణెమ్మను తక్షణమే సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ పాండునాయక్ డిమాండ్ చేశారు. భోజనం బాగా లేదని ఫిర్యాదు చేసినందుకు విద్యార్థినులను వార్డెన్ వేధించిందని ఆరోపించారు. వేధింపులు భరించలేక అధిక మొత్తంలో మాత్రలు మింగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సోమవారం పాండునాయక్ పరామర్శించారు. ఘటన గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

ఫిట్స్‌ను మందులతో కట్టడి చేయవచ్చు

డాక్టర్ సుందరాచారి



మాట్లాడుతున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: ఫిట్స్ వచ్చిన వారు భయపడకుండా వైద్యులను సంప్రదించి క్రమం తప్పకుండా మందులు వాడితే కట్టడి చేయవచ్చని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో నేషనల్ ఎపిలెప్సిడే సందర్భంగా అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఫిట్స్ రావడానికి నూటికి 90 శాతం కారణాలు తెలియవన్నారు. జన్యుపరమైన మార్పుల వలన అధిక రక్తపోటు, రక్తంలో షుగర్ తగ్గిపోవడం, పెరగడం, తలకు దెబ్బ తగడం, బ్రెయిన్ ట్యూమర్స్, బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్ వల్ల రావచ్చని తెలిపారు. కొన్ని సందర్భాల్లో మానసిక రుగ్మత వల్ల కూడా ఫిట్స్ వస్తాయని, అత్యాధునిక మందులు నేడు ఫిట్స్‌కు అందుబాటులో ఉన్నాయన్నారు. న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి మాట్లాడుతూ మూర్ఛ వచ్చినప్పుడు రోగి చుట్టూ గుమికూడకుండా గాలి ఆడేలా చూడాలన్నారు. బాధితుడిని పక్కకు తిప్పి ఉంచాలని, కాళ్లు, చేతులు బంధించకూడదని వివరించారు. సాధారణంగా ఫిట్స్ వచ్చిన రెండు నిమిషాల తరువాత కొట్టుకోవడం ఆగిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద, న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

సోమసుందర్ చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: ఏడు దశాబ్దాల సాహితీ వ్యాసరంగంలో నిమగ్నమైన వజ్రా ఆయుధం కవి ఆవంత్స సోమసుందర్ తెలుగు సాహిత్య క్షేత్రంలో గొప్పకవిగా, విమర్శకుడుగా శతాధిక గ్రంథకర్తగా గుర్తింపు పొందారని రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం కవి ఆవంత్స సోమసుందర్ శత జయంతి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సోమసుందర్ జీవితమే సాహిత్యం అన్న సూక్తి సోమ సుందర్‌కు అక్షరాలా సరిపోతోందన్నారు. గాయకుడు సాహితీవేత్త పి.ఎస్.మూర్తి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఏది రాసినా నమ్మిన సోషలిజం భావనలకు కుల మతాతీత మానవ భావనలను ఎక్కడో అక్కడ వ్యక్తం చేయడం ప్రజల పక్షంగానే నిలబడటం సోమసుందర్‌కి ఇష్టమైన విషయాలన్నారు.

డిసెంబర్ 10వ తేదీ నాటికి వెండింగ్ జోన్లు

కమిషనర్ పులి శ్రీనివాసులు



గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వాస్తవంగా వీధి వ్యాపారులకు డిసెంబర్ పదో తేదీ నాటికి వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని, వీధి వ్యాపారుల సంక్షేమం కోసం చేపడుతున్న పనులపై అసత్య, నిరాధార ఆరోపణలు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వెండింగ్ జోన్లు, రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, శంకర్ విలాస్ ఆర్‌ఓబీ, తాగునీటి సరఫరా అంశాలపై నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలపై కమిషనర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా జోన్స్ కేటాయించి వారిని క్రమబద్ధీకరణ చేయాలని, తద్వారా వారికి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి కృషి చేస్తుంటే, ఇదే అదునుగా ఇప్పటి వరకు వారిని వివిధ రకాలుగా దోచుకున్న వారు వీధి వ్యాపారుల ముసుగులో వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రధాన రోడ్లు, డ్రెయిన్లు, ఫుట్ పాత్‌లు ఆక్రమణలు పెరిగి ప్రస్తుతం జాతీయ రహదారుల వెంబడి కూడా ఆక్రమణలు పెరిగాయని చెప్పారు. జీఎంసీ చేపట్టిన చర్యలపై ప్రజా ప్రతినిధుల పేరుతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దోచుకున్న, ఆరోపణలు చేస్తున్న వివరాలు సేకరించామని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నామని హెచ్చరించారు. జీజీహెచ్ అభివృద్ధి కమిటీ నిర్ణయం మేరకు గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా హాస్పిటల్ చుట్టూ ఉన్న ఆక్రమణలను, ట్రాఫిక్ సమస్య రీత్యా గుజ్జనగుండ్ల చెరువు దగ్గర ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు పేర్కొన్నారు.

శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణానికి

గుంటూరు నగర ప్రజల చిరకాల కోరిక అయిన శంకర్ విలాస్ ఆర్‌ఓబీ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సాంకేతికంగా వంతెన నిర్మాణం ఆర్‌అండ్ బీ చూస్తున్నప్పటికీ విస్తరణ ప్రభావిత భవనాలకు నష్ట పరిహారం నగరపాలక సంస్థ బాధ్యత అని ఇప్పటికే స్టేక్ హోల్డర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభమైతే నగరంలో సుమారు ఒకటి నుంచి 2 ఏళ్లు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రధానంగా రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు అవసరమని అభిప్రాయపడ్డారు.

వీధి వ్యాపారులు గుర్తింపు కార్డులు..

నగరంలోని వీధి వ్యాపారులకు త్వరలో గుర్తింపు కార్డులు అందజేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డుల జారీ కోసం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గుర్తింపు కార్డులు కలిగిన వారికి త్వరలో ఏర్పాటు చేయబోయే వెండింగ్ జోన్లలో వ్యాపారం చేసుకునేందుకు స్థలం కేటాయింపులు చేయనున్నట్లు వివరించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన దరఖాస్తు సెంటర్‌ని కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, మెప్మా పీడీ రామారావు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక సందడి



పాత గుంటూరు శివాలయంలో ప్రత్యేక పూజలు





కార్తిక దీపాలు వెలుగిస్తున్న భక్తులు



కొత్తపేట శివాలయంలో ఆశీర్వదం అందజేస్తున్న అర్చకులు



అరండల్‌పేట శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

సర్వేకు ప్రజలు సహకరించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేకి ఇంటి వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు నగర ప్రజలు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ మ్యాపింగ్, ఎన్‌పీసీఐ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ సర్వేలో కార్యదర్శులు ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లకు వారి ఆధార్, ఫోన్ నంబర్‌ని లింక్ చేసుకోవాలని చెప్పారు. బ్యాంకు అకౌంట్‌లు లేని వారు స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో రూ.2తో నూతన అకౌంట్ ఓపెన్ చేసి సచివాలయ కార్యదర్శులకు వివరాలు అందించవచ్చన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ఇంటి వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు తగిన వివరాలు ఇచ్చి సహకరించాలని కోరారు. నోడల్ అధికారులు ఆయా యాప్ లను డౌన్‌లోడ్ చేసుకొని, క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. నిర్దేశిత గడువు మేరకు సర్వే పూర్తి కావడానికి భాధ్యత తీసుకోవాలన్నారు.

మహిళను మోసం చేసిన ఘటనపై ఫిర్యాదు!

పట్నంబజారు: మహిళను ఏమార్చి ఏటీఎంలో నగదు డ్రా చేస్తున్న ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వివరాలు.. లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఏటుకూరు రోడ్డు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ హిందూ కళాశాల సమీపంలోని ఓ ఏటీఎం సెంటర్ వద్దకు బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా కోసం వచ్చారు. అక్కడ ఉన్న ఓ వ్యక్తి సదరు మహిళకు సాయం చేస్తానని చెప్పి పిన్‌నంబరు అడిగాడు. ఆమె కార్డుకు డబ్బులు రావడం లేదని నమ్మించి అతడి వద్ద ఉన్న నకిలీ ఏటీఎం కార్డు ఆమెకు ఇచ్చి పంపించివేశాడు. ఆమె వెళ్లినట్లు నిర్ధారించుకున్న తరువాత ఆ అకౌంట్ నుంచి రూ.50 వేలు విత్‌డ్రా చేశాడు. నగదు విత్‌డ్రా కావడంతో సదరు మహిళ సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీనిపై లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు.